

హోమియో...

డైలీ హెల్త్ డైరీ

# అడ్వాన్స్‌డ్ జీనోమ్ థెరపీ అంటే ఏమిటి?



డాక్టర్ రాజశేఖర్,
ష్యూర్‌కేర్ హోమియోపతి

నా వయసు 32. నాకు ఎజూస్పెర్మియా(వీర్యంలో శుక్రకణాలు లేకపోవడం) అని తెలిసింది. ఒక హోమియో సెంటర్ వారు జీనోమ్ థెరపీ ద్వారా సమస్యను నయం చేస్తామని తెలిపారు.

– కిరణ్‌కుమార్, తెనాలి

మా పాపకు 5 సంవత్సరాలు. మొదట్లో ఆరోగ్యంగానే ఉండేది. ఈ మధ్య వైరల్ ఫీవర్, జలుబు వచ్చాయి. తరవాత బరువు తగ్గిపోవడం మొదలైంది. వైద్యులు జువైనల్ డయాబెటిస్ అని చెప్పారు. రోజుకు 4 యూనిట్ల ఇన్సులిన్ వాడుతున్నాం. ఒక హోమియో సెంటర్ వారు మోడరన్ అడ్వాన్స్‌డ్ జీనోమ్ థెరపీ ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. అంటే ఏమిటి?

– శ్రీహరికృష్ణ, పరకాల

హోమియోపతి మందులను వివిధ పద్ధతులలో ఇస్తారు. త్వరిత గతిన వచ్చే వ్యాధులకు, అంటు వ్యాధులకు వ్యాధి లక్షణాలను బట్టి ఇస్తారు. అదేవిధంగా వ్యాధి తీవ్రతను బట్టి పాథాలజీని ప్రామాణికంగా చూసుకుని ఇస్తారు. కొన్నిరకాల వ్యాధులకు ముఖ్యమైన లక్షణాన్ని లేదా అసాధారణంగా ఉన్న లక్షణాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుని మందులను ఇస్తారు. ఈ పద్ధతిని కీనాట్ ప్రిస్క్రిప్షన్ అంటారు. కొన్నింటికి కేవలం వ్యాధి లక్షణాలను, మరి కొన్నింటికి కేవలం మానసిక లక్షణాలను ప్రామాణికంగా తీసుకుంటారు. కొన్నిసార్లు వ్యాధి లక్షణాల పెరుగుదల, తగ్గుదలను ప్రామాణికంగా తీసుకుని మందులు ఇస్తారు. ఈవిధంగా చాలా పద్ధతులు ఉన్నప్పటికీ సంప్రదాయ హోమియో వైద్యం ప్రకారం అన్ని రకాల వ్యాధులకు ముఖ్యంగా సరైన కారణం లేనటువంటి దీర్ఘకాలిక వ్యాధులకు మనిషి బాహ్య, అంతర స్వభావాలను బట్టి అంటే మానసిక, శారీరక స్థితిగతులను, వయస్సును, లింగభేదాన్ని, సాంఘిక పరిస్థితులను, జీవన సరళిని, వ్యాధి కారణాన్ని, వ్యక్తి తత్వాన్ని బట్టి మందును ఇవ్వడాన్ని కాన్‌స్టిట్యూషన్ పద్ధతి అంటారు. అయితే ఒక వ్యక్తి బాహ్య, అంతర స్వభావాలు, మానసిక, శారీరక స్థితిగతులను వారిలో ఉండే జన్యువులు (జీన్స్) నిర్ణయిస్తాయి. కనుక అన్ని స్థితిగతులను, స్వభావాలను ప్రామాణికంగా తీసుకోవడం అంటే వారిలోని జన్యువును ప్రామాణికంగా తీసుకుని మెడిసిన్ ఇవ్వడమే. అందువల్ల దీనిని జీనోమ్ థెరపీ అని కూడా అంటారు. ఇందులో జన్యువులను శరీరంలో ప్రవేశపెట్టడం గాని, ఎక్కువ ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగాని ఏమీ ఉండవు.



ఎజూస్పెర్మియా అంటే సెమెన్‌లో శుక్రకణాలు ఏ మాత్రం లేకపోవడం, ఉన్నా చలనం లేకపోవడం. ఇది వంధ్యత్వానికి దారితీస్తుంది. దీనికి కారణం హార్మోన్లు కావలసినంత వృద్ధి చెందకపోవడం ఉదా. ఎఫ్.ఎస్.హెచ్ లెవల్స్ తగ్గిపోవడం వంటివి.

- వీర్యోత్పత్తి ఉన్నప్పటికీ అవి వచ్చే నాళాలకు ఏదైనా ఇన్ఫెక్షన్స్ అడ్డుగా ఉండటం వల్ల సెమెన్ ద్వారా బయటకు రాకపోవడం, పూర్తిగా టెస్టిస్ లేకపోవడం, ఉన్నా వృద్ధి చెందకపోవడం, టెస్టిస్ ఉదరంలోనే ఉండిపోవడం, పుట్టుకతోనే టెస్టిస్ అసాధారణంగా ఉండటం వంటివి.

హోమియో వైద్యం ద్వారా హార్మోన్ల అసమతుల్యత వల్ల, ఇన్ఫెక్షన్స్ వల్ల కలిగే ఎజూస్పెర్మియాను మాత్రమే నయం చేయగలం. కాబట్టి మీరు ఒకసారి టెస్టిక్యులర్ బయాప్సీ చేయించుకుంటే అసలు కారణం తెలుస్తుంది. దానిని బట్టి మీరు ఏ మందులు వాడాలో డిసైడ్ చేసుకోవచ్చు.

జువైనల్ డయాబెటిస్ ఉన్న పిల్లల్లో కొన్నిసార్లు ఏవైనా వైరల్ ఇన్ఫెక్షన్లు సోకిన తర్వాత శరీరంలోని రోగనిరోధక శక్తి అసాధారణంగా పనిచేయడం ప్రారంభిస్తుంది. అంటే వైరస్ కణాలతోపాటుగా శరీరంలో చక్కెర శాతాన్ని నియంత్రణలో ఉండే ఇన్సులిన్‌ను జనింప చేసే క్లోమంలోని బీటా5 కణాలను కూడా విచ్ఛిన్నం చేయడం ప్రారంభిస్తుంది. దీని వలన ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోయి చిన్న పిల్లల్లో మధుమేహానికి దారితీస్తుంది.మీరు మీ అమ్మాయికి కాన్‌స్టిట్యూషన్ పద్ధతిలో హోమియో మందులను ఆరునెలల పాటు వాడి చూడండి. అయితే ఇన్సులిన్ ఇవ్వడాన్ని మాత్రం అకస్మాత్తుగా ఆపకూడదు. డయాబెటాలజిస్ట్ సలహా మేరకు ఇన్సులిన్, తదితర మందులను వాడుతూ ఉండండి.

మీ సాధారణ ఆరోగ్య సమస్యలకు హోమియో చికిత్సా విధానంలో సలహాల కోసం రాయండి. మా చిరునామా: హోమియో కౌన్సెలింగ్, సాక్షి ఫ్యామిలీ,సాక్షి దినపత్రిక, సాక్షి టవర్స్, 6-3-249/1, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034
ఇ-మెయిల్: health@sakshi.com
(గమనిక: మెయిల్ పంపేవారు సబ్జెక్ట్‌లో homeo అని రాయండి)